సాక్షి జగిత్యాల

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



రైల్వే కేటాయింపులు భేష్!

కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కరీంనగర్ రైల్వేకు పెద్ద పీట వేశారు. ఉమ్మడి జిల్లాకు మునుపెన్నడూ చూడని స్థాయిలో ఏకంగా రూ.647 కోట్లను కేంద్రం కేటాయించింది. 10లో▸



అంజన్న సేవలో ఎస్పీ

కొండగట్టు: కొండగట్టు అంజన్నను శుక్రవారం ఎస్పీ భాస్కర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఎస్పీని శాలువతో సత్కరించారు.

గరిష్టం/కనిష్టం

30.0/15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

బదిలీల ప్రక్రియకు సహకరించాలి



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి తదితరులు

జగిత్యాల: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ఆధ్వర్యంలో పీఆర్టీయూ నాయకులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యే ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలకు సహకరించాలని, మన ఊరు- మన బడి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే జిల్లా సమగ్ర శిశు అభియాన్ ప్రత్యేకాధికారులు, అకౌంట్స్ ఆఫీసర్లు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, కార్యదర్శి ఆనందరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో నరేశ్

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోపు వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీపీవో నరేశ్ ఆదేశించారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామాల వారీగా పల్లె ప్రగతి పనులు, వన నర్సరీల్లో హరితహారం మొక్కల పెంపకం, ఉపాధిహామీ, గ్రామీణ క్రీడా ప్రాంగణాల నిర్మాణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్లె ప్రగతి పనులు నిరంతర కొనసాగించాలని, మొక్కల పెంపకం, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, ఏపీవో వేణు, టీఏలు రాజేశం, నానీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి



డ్రైవర్లతో మాట్లాడుతున డీఎం

కోరుట్ల: ప్రతీ డ్రైవరు ప్రయాణికులతో తప్పనిసరిగా మర్యాదగా ప్రవర్తించాలని కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మీప్రసూన అన్నారు. శుక్రవారం బస్ డిపోలో హైర్ బస్ డ్రైవర్లకు మర్యాద, సురక్షితమైన డ్రైవింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, వారు కోరిన చోట దించడం, ఎక్కించుకోవడం చేయాలన్నారు. సురక్షితమైన, డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా బై లైన్స్ ఉన్న నిర్ణీత ప్రాంతాల్లో బస్సులు నడపాలన్నారు. అలాగే జనం ఎక్కువగా ఉన్న చోట నెమ్మదిగా వెళ్లాలని, ముందు వెనక వాహనాలకు 50 ఫీట్ల దూరం పాటించాలని సూచించారు. మద్యం తాగి బస్సు నడపరాదని, జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్‌మెన్ తిరుపతి, కోరుట్ల, మెట్‌పల్లి ట్రాఫిక్ సూపరింటెండెంట్‌లు జీపి.సింగ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మల్లాపూర్ ఏపీఎంకు షోకాజ్ నోటీసులు



జగిత్యాలరూరల్: మల్లాపూర్ మండలానికి చెందిన ఏపీఎం ఎస్.రాజేశ్‌కు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని శ్రీమారుతి గ్రామైక్య సంఘం ద్వారా వానాకాలం వరిధాన్యం కొనుగోలు ఆడిట్‌ను నిలిపివేయడంతో పాటు కమిటీ సభ్యులను దూషించడంపై నోటీసు జారీ అయింది. నిబంధనల ప్రకారం వరిధాన్యం కొనుగోళ్ల డాటాను, బిల్లులను బుక్ కీపర్ ఆన్‌లైన్‌లో డాటా ఎంట్రీ పూర్తి చేసి సీసీ, మండల సమాఖ్య ధ్రువీకరణలతో ఏపీఎం సంతకం కోరగా, వ్యక్తిగత కారణాలతో అనవసరపు విషయాలతో దూషిస్తూ సంతకం చేయకుండా ఆడిట్‌ను నిలిపివేశాడని షోకాజ్ నోటీసు జారీ చేశారు.

కిస్తీల చెల్లింపులో గోల్‌మాల్..!

ఒక నెల కడుతూ.. మరో నెల కాజేస్తూ..

- స్త్రీనిధి రుణాల బకాయిలు పక్కదారి
- జగిత్యాల మున్సిపల్‌లో వెలుగుచూసిన వైనం
- దాదాపు రూ.20–30 లక్షల వరకు అవకతవకలు



'జగిత్యాల మున్సిపల్‌లో స్త్రీనిధి రుణాల కిస్తీల చెల్లింపులో పక్కదారి పట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రుణాలు ఎత్తుకున్న మహిళా సంఘాల సభ్యులు నెలనెలా సంబంధిత అధ్యక్షులు, ఆర్పీలకు కిస్తీలు చెల్లిస్తుంటారు. ఒకనెల కిస్తీ బ్యాంక్ అధికారులకు కట్టడం, మరో నెల కట్టకుండా సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. ఇలా దాదాపు 8 సమాఖ్యలు పెండింగ్‌లో ఉంచారని స్త్రీనిధి అధికారులు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తే అన్ని విషయాలు వెలుగుచూసే అవకాశాలున్నాయి'.

జగిత్యాల: మహిళల సాధికారతకు గతంలో మహిళా సంఘాలకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందించే వారు. రెండేళ్ల నుంచి మున్సిపాలిటీల్లో సైతం స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నారు. ఇక్కడే మహిళా సంఘాల అధ్యక్షులు, ఆర్పీలు మహిళా సంఘాలకు చెందిన సభ్యుల సొమ్మును కాజేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాయికల్‌లో ఇటీవల రూ.19.89 లక్షలు మహిళా సంఘాల అధ్యక్షులు, ఆర్పీలు కిస్తీలు చెల్లించకుండా సొంతానికి వాడుకున్న విషయం తెలిసిందే. తాజాగా జగిత్యాల మున్సిపల్‌లో మహిళా సంఘాల సభ్యులు చెల్లిస్తున్న స్త్రీనిధి రుణ వాయిదాల సొమ్మును సంఘాల అధ్యక్షులు, ఆర్పీలు బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తెలుస్తోంది.

కిస్తీలు చెల్లించినా రశీదు ఇవ్వరు

రుణాలు ఎత్తుకున్న సభ్యులు సంఘం అధ్యక్షులు లేదా ఆర్పీలకు నెలనెలా చెల్లిస్తుంటారు. కాగా, ఒకనెల కట్టడం మరో నెల కట్టకుండా ఉండటం, ఇలా ఏడాది పొడవునా మధ్యమధ్యన నెలల్లో కిస్తీలు చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. సభ్యులు కిస్తీలు చెల్లిస్తున్నా వారికి ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదు. దీంతో సభ్యులే ఏదో చిన్నపాటి బుక్కుల్లో రాయించుకుంటున్నారు. కాగా అధ్యక్షులు, ఆర్పీలు జిమ్మిక్కులు ఉపయోగిస్తూ ఒక నెల కట్టకుండా మరో నెల కడుతూ సొమ్ము కాజేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా స్త్రీనిధి అధికారులు రికవరీ కోసం మహిళా సంఘాల సభ్యుల వద్దకు వెళ్తే తాము ప్రతినెలా చెల్లిస్తున్నామని, ఆధారాలున్నాయని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం తమ అకౌంట్లో జమ కావడం లేదని, చెల్లించాల్సిందేనని వారిపై ఒత్తిడి తెస్తున్నారు. జగిత్యాల మున్సిపల్‌లో 8 సమాఖ్యల నుంచి సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని తెలిసింది.

పొదుపు డబ్బులు సైతం..

జగిత్యాల మన్సిపల్‌లో 66 సమాఖ్యలు ఉండగా 42 మాత్రమే రుణాలు పొందాయి. స్త్రీనిధిలో రుణాలు పొందాలంటే మహిళ సంఘం అకౌంట్‌లో రూ.5 నుంచి రూ.6 వేల వరకు ఉండాలి. ఇవీ మహిళా సంఘాల సభ్యులే చెల్లిస్తుంటారు. కానీ 24 సమాఖ్యలలో పొదుపు లేక స్త్రీనిధి రుణాలు అందడం లేదు. మహిళా సంఘాల సభ్యులు మాత్రం పొదుపునకు సంబంధించిన డబ్బులు ఇచ్చామని పేర్కొంటున్నారు. పొదుపు డబ్బులు సైతం పక్కదారి పట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో 8 సమాఖ్యల రుణాల చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు తెలిసింది. ఒక సమాఖ్యలో 20 నుంచి 25 మంది సభ్యులుంటారు. నెలనెలా వీరు కట్టే కిస్తీ దాదాపు రూ.లక్ష వరకు ఉంటాయి. సుమారు రూ.20–30 లక్షలు పక్కదారి పట్టినట్లు సమాచారం. జగిత్యాల మున్సిపల్‌లో 2022–23కు గాను రూ.3 కోట్లు రుణాలు ఇవ్వగా రూ.56 లక్షల బకాయిలున్నాయి. సంఘాల సభ్యులకు ఎలాంటి రశీదులు ఇవ్వకుండా అధ్యక్షులు, ఆర్పీలు మెప్మా అధికారుల అండతోనే కాజేస్తున్నట్లు అనుమానాలు సైతం ఉన్నాయి. ఇటీవల కోరుట్లలో ఓ ఆర్పీ బ్యాంక్ లింకేజీ రుణం రూ.10 లక్షలతో ఉడాయించిన విషయం తెలిసిందే.

మా దృష్టికి వస్తే కఠినచర్యలు

స్త్రీ నిధి రుణాల పక్కదారి విషయం మా దృష్టికి రాలేదు. రాగానే చర్యలు తీసుకుంటాం. ఎవరు సొంతానికి వాడుకున్నా కఠిన చర్యలు తీసుకుంటాం. రాయికల్‌లో ఘటనలో రికవరీ చేస్తున్నాం. జగిత్యాలలో సైతం పూర్తిస్థాయిలో విచారణ జరిగేలా చూస్తాం.

– ఆనందరావు, స్త్రీనిధి రీజినల్ మేనేజర్

జగిత్యాల మున్సిపల్‌లో..	
మహిళా సంఘాల సమాఖ్యలు	66
రుణాలు పొందినవి	42
పొందిన రుణాలు	రూ.3 కోట్లు
రావాల్సిన బకాయిలు	రూ.56 లక్షలు
అక్రమాలు జరిగినవి రూ.30లక్షల వరకు	

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



కార్యదర్శులకు సూచనలిస్తున్న శివాజీ

కథలాపూర్(వేములవాడ): గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు కూలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ డీఆర్డీవో బాలె శివాజీ పేర్కొన్నారు. శుక్రవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామంలో కనీసం 40 మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోతే ప్రత్యామ్నాయంగా మొక్కలు ఉండేలా చూడాలన్నారు. గ్రామాలవారీగా కూలీల హాజరును కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో జనార్దన్, ఏపీవో రాజేందర్, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సాఫ్ట్‌బాల్ రెఫరీగా జగిత్యాల వాసి



గౌతమ్

జగిత్యాల: జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రెఫరీగా కృష్ణానగర్‌లోని శ్రీచైతన్య ఈటెక్నో స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న గౌతమ్ ఎంపికయ్యారు. ఈనెల 4 నుంచి 9 వరకు ఒడిస్సా రాష్ట్రంలోని పూరి జిల్లాలో జరిగే జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు న్యాయనిర్ణేతగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా గౌతమ్‌ను ప్రిన్సిపాల్ సచిన్, జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు మనోహర్, సెక్రెటరీ వెంకటేశ్, పీఈటీలు మహేశ్, గంగాధర్ అభినందించారు.

సీనియర్ సిటిజన్ రక్షణకు ప్రాధాన్యత

- ఎస్పీ భాస్కర్



ఎస్పీని సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

జగిత్యాల: సీనియర్ సిటిజన్ రక్షణకు ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ భాస్కర్ అన్నారు. శుక్రవారం సీనియర్ సిటిజన్ జిల్లా అసోసియేషన్ నాయకులు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వయోవృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని, వేధింపులకు, నిరాదరణకు గురిచేసిన వారు వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులేనన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ హరి అశోక్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ జీఆర్.దేశాయి, విశ్వనాథం, హన్మంతరావు, యకూబ్, మానాల కిషన్, విఠల్, అశోక్‌రావు పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజం కోసమే కంటివెలుగు



కంటి వెలుగు శిబిరంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఝాన్సీ, సిబ్బంది

మల్లాపూర్(కోరుట్ల): అంధత్వ రహిత సమాజం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటివెలుగు పథకాన్ని ప్రవేశపెట్టిందని పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సాతారంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ టీం డాక్టర్ ఝాన్సీ, పీఎంవో రూపలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంటి పరీక్షలు పకడ్బందీగా చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని, సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి నరేష్, కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు నాగార్జున, రాహుల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాన్ని వినియోగించుకోవాలి

మల్యాల(చొప్పదండి): ప్రజలు కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మద్దుట్ల గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించగా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సందర్శించారు. స్థానికులతో మాట్లాడారు. శిబిరానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కళ్లను కాపాడుకోవాలని, శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్లేటి మలమ్మ, మండల వైద్యుడు సిరికొండ రవిశంకర్, కార్యదర్శి దివ్య, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్‌ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన సెక్టోరియల్ అధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి రాకేశ్

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట మండల పరిషత్ పాఠశాలను జిల్లా సెక్టోరియల్ అధికారి రాకేశ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం అమలు, విద్యార్థుల ప్రగతి, బడి బయట విద్యార్థుల వివరాలు, స్వచ్ఛ పాఠశాల, శాలసిద్ధి, చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల నమోదును పరిశీలించారు. ఎఫ్ఏ 1,2,3, ఎస్ఏ1 రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నూతన పరీక్షా విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయులు సెక్టోరియల్ అధికారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కె.లలిత, మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన



జగిత్యాల: ప్రకృతి విపత్తులైన ఫైర్ యాక్సిడెంట్లు, వరదల తదితర వాటి నుంచి ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు ఎన్డీఆర్ఎఫ్ బృందం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు తమకు సమాచారం అందిస్తే వెంటనే కాపాడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కిశోర్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టప్రకారం దత్తత తీసుకోవాలి

- బాలల పరిరక్షణ అధికారి హరీశ్



పాపను తల్లికి అందజేస్తున్న అధికారులు

జగిత్యాల: చట్టప్రకారం పిల్లలను దత్తత తీసుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరీశ్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని శంకులపల్లికి చెందిన ముస్తఫాఖాన్ రఫీ రెండో కూతురును నిర్మల్ జిల్లాకు చెందిన రహీం బేగం అనే మహిళ నోటరీ ద్వారా దత్తత తీసుకున్నారు. ఈ విషయాన్ని అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకులు జిల్లా బాలల పరిరక్షణ అధికారికి సమాచారం అందించారు. వెంటనే వెళ్లి వివరాలు సేకరించగా నిర్మల్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో నిర్మల్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి జగిత్యాలకు తీసుకువచ్చి ముస్తఫాఖాన్ రఫీకి పాపను అందజేశారు. తల్లిదండ్రుల వద్దే పెరిగే హక్కు పిల్లలకు ఉందని, పిల్లలను పోషించలేని పరిస్థితి ఉంటే ప్రభుత్వానికి అప్పగించాలే తప్ప ఈ విధంగా చేయవద్దని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వానికి పిల్లలను అందిస్తే విషయం గోప్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దృష్టిలోపం గుర్తించడంలో నిర్లక్ష్యం చేయొద్దు



మంగేళలో కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద

- మన ఊరు- మన బడి పనుల్లో వేగం పెంచాలి
- అదనపు కలెక్టర్ మకరంద

సారంగాపూర్(జగిత్యాల): దృష్టిలోపం గుర్తించడంలో నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ మకరంద అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ కంటి వెలుగు పరీక్షలు చేస్తుండగా నిశితంగా పరిశీలించారు. అద్దానికి దృష్టి లోపం గుర్తించే పరికరాలకు ఎంత దూరం ఉంటే గుర్తించవచ్చన్న దానిపై కొంత తేడా రావడంపై అసహనం వ్యక్తం చేశారు. దృష్టిలోపం గుర్తించడంలో సాంకేతిక నిబంధనలకు (మెడికల్ నిబంధనలకు) అనుగుణంగా నిర్ధారించాలని సూచించారు. పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తే మరోసారి ఇక్కడ పరీక్షలు నిర్వహించాల్సి వస్తుందని కంటి వెలుగు నిర్వహిస్తున్న బృందానికి సూచించారు. అనంతరం బీర్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో మన ఊరు –మన బడి పనులను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. మండలంలోని మూడు గ్రామాల్లో క్రీడాప్రాంగణాల పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెంటనే పూర్తి చేయాలని మండల అధికారులను ఆదేశించారు. అలాగే రోళ్లవాగు ప్రాజెక్టు పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కట్ట నిర్మాణం కోసం 1 లక్ష క్యూబిక్ మీటర్ల మట్టి అవసరం ఉందని, ఇందుకు కందెనకుంట శివారుల్లో మట్టి సేకరణకు రెవెన్యూ శాఖ ద్వారా 15 ఎకరాల భూమిని సేకరించారని, మట్టి సేకరణకు పూర్తిస్థాయి అనుమతులు ఇవ్వాలని కోరగా.. రెండుమూడు రోజుల్లో మట్టి సేకరణకు అనుమతులు అందేలా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఆయన వెంట మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి, ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్, ఎంపీడీవో మల్లారెడ్డి, ఎంపీవో వెంకటరామకృష్ణరాజు తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- 421 పనులకు రూ.39 కోట్లు
- రెండో విడతలో రూ.25 కోట్లతో ప్రతిపాదనలు
- కలెక్టర్ ఆమోదం కోసం ఎదురుచూపు
- సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణాలకు నిధులు
- మార్చిలోగా చేయకుంటే వెనక్కే..



తాట్లావాయిలో సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించిన దారి

రాయికల్(జగిత్యాల): గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్లు, మురికికాలువల నిర్మాణానికి నిధులు మంజూరైనాయి. ఉపాధి పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.39 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పల్లె ప్రగతి, 15వ ఆర్థిక సంఘం నిధులు సరిపోక ఇబ్బందుల్లో ఉన్న పాలకవర్గాలకు తాజాగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరవడం కొంత ఊరటనిచ్చింది. జిల్లాలోని 18 మండలాల్లో 421 పనులకు గాను రూ.39 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా కలెక్టర్ ఆమోదిస్తే మరో రెండు రోజుల్లో మరో రూ.25 కోట్ల నిధులు మంజూరుకానున్నాయి. దీంతో జిల్లాలో మరో 275 మొత్తం 696 పనులకు రూ.64 కోట్లు నిధులు విడుదల కానున్నాయి.

రెండు విడతలుగా పనులు

ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం నిమిత్తం ఏటా మెటీరియల్ కాంపోనెంట్ నిధులను విడుదల చేస్తారు. కూలీల చెల్లింపులకు 40 శాతం, నిర్మాణ సామగ్రి వాటా కింద 60 శాతం నిధులను ఆయా పంచాయతీలకు కేటాయిస్తారు. సాధారణంగా ఈ పనులను స్థానిక ఎమ్మెల్యేల సూచనతో కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నా కమిటీ ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతారు. మొదటి విడత కింద 421 పనులకు రూ.39 కోట్లు మంజూరు కాగా, రెండో విడత కింద 275 పనులకు రూ.25 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. రెండో విడత నిధులు మంజూరు కోసం కలెక్టర్ నుంచి ఆమోదం తీసుకోవాల్సి ఉంది. మరో 2–3 రోజుల్లో ఆమోదం వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు పర్యవేక్షించనున్నారు.

గడువులోగా చేయకుంటే వెనక్కే..

పంచాయతీ పాలకవర్గం తీర్మానాన్ని అనుసరించి ఎక్కడ సీసీ రోడ్డు, మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలో నిర్ణయించనున్నారు. నామినేషన్ పద్ధతిన పాలకవర్గం సూచించిన వ్యక్తి పనులు చేస్తే, సర్పంచ్ పేరిట బిల్లులు విడుదలవుతాయి. గతంలో గడువు తక్కువగా ఉందని హడావుడిగా పనులు పూర్తి చేయడంతో కొన్నిచోట్ల నాణ్యత లోపించింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలలే సమయం ఉండటంతో ఈలోగా పనులు చేయాలి. లేకుంటే నిధులు వెనక్కి మళ్లే ప్రమాదముంది. దీంతో త్వరగా తీర్మానం పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు.

గ్రామాల్లో అభివృద్ధికి దోహదం

"పంచాయతీరాజ్ శాఖ మంజూరు చేసిన నిధులు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతాయి. అభివృద్ధి పనులన్నీ మార్చి చివరిలోపు పూర్తి చేయాలి. పనులు చేయకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయి."

– రహమాన్, ఈఈ, పంచాయతీరాజ్

క్లుప్తంగా

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే


స్పీకర్‌తో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు. ఇందులో ఎమ్మెల్సీ కవిత, ఇతర ఎమ్మెల్యేలు సైతం ఉన్నారు.

ప్రజాసేవతో జాతీయ పురస్కారం


మల్లేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

మల్లాపూర్: ప్రజాసేవతో జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ జాతీయ పురస్కారం పొందడం అభినందనీయమని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో మల్లేశ్‌కు జ్ఞాపిక అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాగృతి యువత జిల్లా అధ్యక్షుడిగా ప్రజాసేవ చేస్తూనే సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవడంతో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ మల్లేశ్‌ను జీవిత సాఫల్య జాతీయ పురస్కారానికి ఎంపిక చేసిందన్నారు. ఈ పురస్కారంతో మల్లేశ్ యువతకు స్ఫూర్తిగా నిలిచాడన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, జాగృతి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రంగు నవీన్ ఆచారీ పాల్గొన్నారు.

మండలవాసికి డాక్టరేట్


కోదం లావణ్య

మేడిపెల్లి: మండలకేంద్రానికి చెందిన కోదం లావణ్య ఉస్మానియా యూనివర్సిటీలో రాజనీతిశాస్త్ర విభాగంలో డాక్టరేట్ సాధించింది. జెండర్ మ్యాపింగ్ ఇన్ యాక్సెస్ టూ స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్ తెలంగాణ ఏ కేస్ స్టడీ ఆఫ్ కరీంనగర్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధనకు గానూ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు ఉస్మానియా యూనివర్సిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం కోదం లావణ్య కరీంనగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో పాటు పలువురు అభినందలు తెలిపారు.

నవీన్ మిట్టల్ సేవలు అవసరం

గొల్లపల్లి: దశాబ్దాలుగా ఇంటర్‌బోర్డులో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి, ఇంటర్ విద్య పరిరక్షణకు ఇంటర్‌బోర్డు కమిషనర్ నవీన్‌మిట్టల్ చేపట్టిన పలు సంస్కరణలు ఇంటర్ విద్య పటిష్టానికి ఎంతో దోహదపడతాయని కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేమిడి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ.. ఇంటర్‌బోర్డు కార్యాలయం దశాబ్దాలుగా అవినీతిపరుల అక్రమార్కుల అడ్డాగా మారిందని, నవీన్‌మిట్టల్ అనతికాలంలోనే అక్రమార్కుల భరతం పట్టి గాడిలో పెట్టారని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగాసాంకేతిక విద్య పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ, త్వరితగతిన ఫలితాలు అందించేందుకు ఆన్‌లైన్ మూల్యాంకణ పద్ధతిని ప్రవేశపెట్టారన్నారు. ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యేంత వరకు నవీన్‌మిట్టల్‌ను ఇంటర్‌బోర్డు కమిషనర్‌గా అదనపు బాధ్యతలతో కొనసాగించాలని కోరారు.

ఆ పిల్లలు సేఫ్

- అపరిచితురాలే అపహరించింది!
- పిల్లల కిడ్నాప్ వ్యవహారంలో కొత్తమలుపు
- సీడబ్ల్యూసీ ఎదుట పదేపదే స్టేట్‌మెంట్లు మార్చిన నిందితురాలు
- డబ్బులు అడుగుతున్నారని ఎదురుతిరిగిన నిందితురాలు
- బాధితుల తరఫున మహారాష్ట్ర అధికారులతో మాట్లాడిన 'సాక్షి'
- 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపిన బాధితులు


చిన్నారులను తండ్రులకు అప్పగిస్తోన్న చైల్డ్‌వెల్ఫేర్ అధికారి రామ్ జాప్తార్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌లో కిడ్నాపైన చిన్నారుల కథ సుఖాంతమైంది. రైల్వే పోలీసుల అప్రమత్తత, మహారాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ల చొరవతో ఎట్టకేలకు చిన్నారులు తండ్రుల ఒడి చేరారు. ఈ క్రమంలో చిన్నారులను అపహరించిన నిందితురాలు బాధితులపై పలు ఆరోపణలు చేసి వారిని అక్కడ ఇక్కట్లపాలు చేసే యత్నం చేయడం గమనార్హం. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఉదంతం ఆద్యంతం అనేక మలుపులు తిరిగింది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బోర్డ్ మెంబర్ రామ్ జాప్తార్ కథనం ప్రకారం.. ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం మంకమ్మతోటకు చెందిన మిడిదొడ్డి లోకేశ్ (9), మాదాసి అక్షిత (11)లను పొరుగున ఉండే జయ శ్రీ చాక్లెట్లు కొనిస్తానని తీసుకెళ్లింది. కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైలెక్కి ఔరంగాబాద్‌కు బయల్దేరింది. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో ఔరంగాబాద్ సమీపంలోని జాల్నా రైల్వే స్టేష న్ ప్లాట్‌ఫారంపై దిగిన చిన్నారులను జయశ్రీ కొట్టింది. అంతటితో ఆగకుండా వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ పగలగొట్టింది. వెంటనే స్పందించిన రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు పిల్లలను విచారించి ఆమె నుంచి కాపాడి మహా రాష్ట్ర చిల్డ్రన్స్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులకు అప్పగించారు. షాక్‌లో ఉన్న పిల్లలకు తొలుత కౌన్సెలింగ్ ఇచ్చి.. చిల్డ్రన్స్‌హోంకు పంపారు.

అర్ధరాత్రి బయల్దేరిన తండ్రులు..

గురువారం రాత్రి విషయం తెలుసుకున్న పిల్లల తండ్రులు మిడిదొడ్డి ప్రవీణ్, మాదాసి సురేశ్‌లు జయశ్రీ భర్త సత్యనారాయణ, ఆమె కుమారుడు శివకుమార్‌తో కలిసి మహారాష్ట్రకు కారులో బయల్దేరి వెళ్లారు. ఉదయం పిల్లల గుర్తింపు ప్రక్రియ పూర్తవగానే.. తల్లిదండ్రులకు అప్పగించారు. తిరిగి వెళ్లే సమయంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు కారులో రావొద్దని జయశ్రీ వాదనకు దిగింది. దీంతో వారు తాము కూలీ పనిచేసుకునే వారిమి అని, తిరిగి వెళ్లేందుకు బస్సు ఖర్చులు ఇవ్వాలని అడిగారు. దీంతో తనను బాధితులు డబ్బులు అడుగుతున్నారని మధ్యాహ్నం సీడబ్ల్యూసీ అధికారుల ముందు జయశ్రీ ఆరోపించింది. జయశ్రీ స్వస్థలం ఔరంగాబాద్. ఆమెది మరాఠీ మాతృభాష. బాధితులు ఉన్నత విద్యావంతులు కాదు. ఇద్దరూ కూలీలే. హిందీ కూడా రాదు. కంగారుపడిన బాధితులు 'సాక్షి'ని ఆశ్రయించారు. దీంతో విషయాన్ని అక్కడి అధికారులకు సాక్షి మొత్తం వివరించింది. అసలు విషయం తెలుసుకున్న అధికారులు వారికి నచ్చజెప్పి వారిని అందరినీ ఒకే కారులో తిరిగి వెళ్లాలని ఒప్పించారు. కార్పొరేటర్ దిండిగాల మహేశ్ కూడా చొరవ తీసుకున్నారు. బాధితులు, నిందితులతో మాట్లాడి వాగ్వాదాలు లేకుండా ఇంటికి రావాలని వారికి ఫోన్‌లో నచ్చజెప్పారు.

ఆంటీ మమ్మల్ని బాగా కొట్టింది..!

కిడ్నాప్‌కు గురైన అక్షిత, లోకేశ్‌లు 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. తమను కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కించిందని, ఎక్కడికి తీసుకెళ్తున్నావని ప్రశ్నించిన ప్రతీసారీ.. మార్గమధ్యలో చాలా కొట్టిందని వాపోయారు. జాల్నాలో రైలు ఆగగానే తాము దిగి ఆమెతో వాగ్వాదానికి దిగామన్నారు. దీంతో ఆమె కోపంతో తమ ఫోన్ పగలగొట్టిందని.. ఇంతలో ఆర్పీఎఫ్ బలగాలు వచ్చి తమను కాపాడారని వివరించారు. అనంతరం మహారాష్ట్ర అధికారులు జయశ్రీ తన వాంగ్మూలాలు పదేపదే మారుస్తుండటంతో తలలు పట్టుకున్నారు. విచారణ సమయంలో.. పిల్లలను తాను దేవుడు వద్దకు తీసుకెళ్తున్నానని ఒకసారి, తమ పనిమనిషి పిల్లలని మరోసారి ఇలా రకరకాల స్టేట్‌మెంట్లు ఇచ్చింది. దీంతో ఆమె మానసిక స్థితిపై వారికి సందేహాలు కలిగాయి. అదే అనుమానంతో అధికారులు తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో అసలు కథ వెలుగుచూసింది. జయశ్రీ కుటుంబ సభ్యులు ముందు నుంచి ఆమెను కాపాడే యత్నం చేస్తున్నారు. బాధితులు జయశ్రీపై ఎక్కడ కిడ్నాప్ కేసు పెడతారో అని వారిని పోలీసుస్టేషన్ వెళ్లకుండా.. తమ కారులో మహారాష్ట్ర తీసుకెళ్లారు. తీరా అక్కడికెళ్లాక వారిని బెదిరింపులకు గురిచేశారు. మహారాష్ట్ర అధికారుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. అయితే.. బాధితులు సదరు నిందితురాలిపై కిడ్నాప్ కేసు పెడతామని నిర్ణయించుకున్నారు. దీంతో ఆమెను తెలంగాణకు తీసుకురాకుండా ఆమె స్వస్థలం ఔరంగాబాద్‌కు తరలించే యత్నం చేస్తున్నారు.

కళా తపస్వికి ఘననివాళి


నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు


నివాళి అర్పిస్తున్న అంకతి భరత్‌కుమార్

జగిత్యాల: భారతీయ చలనచిత్రపరిశ్రమను ప్రపంచ పుటల్లోకి తీసుకెళ్లిన మహోన్నతుడు, కళా తపస్వి కె.విశ్వనాథ్ అని సాహితివేత్తలు అన్నారు. శుక్రవారం దేవిశ్రీ గార్డెన్స్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలుగు చిత్రాల్లో సంస్కృతి, సాంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసిన ఆయన మృతి తెలుగు చిత్రపరిశ్రమకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, జాగృతి జిల్లా ప్రతినిధి జమున, కవులు, సరోజన, అయిత అనిత, శ్రీలక్ష్మీ, బోనగిరి దేవయ్య, శ్రీనివాస్‌గౌడ్, జలేందర్ పాల్గొన్నారు.

మల్లాపూర్: కళతపస్వీ కె.విశ్వనాథ్ సినిమాలు చిరస్మరణీయమని పడిపోయా సీమాయలో సినీ నిర్మాత అంకతి భరత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తిలో కె.విశ్వనాథ్ చిత్రపటానికి ఆయన నివాళి అర్పించారు. ఆయన మృతి సినీరంగానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో నటులు రాధారపు ప్రభాకర్, మాలేపు శంకర్, రాధారపు దేవదాస్, పుప్పాల నాగేశ్, లోక సురేశ్, దోనికెన మహేందర్, తరి రామానుజం తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

- రూ.3 లక్షలు ఆస్తినష్టం


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు, అధికారులు

వీర్నపల్లి: దళితబంధు లబ్ధిదారుడి గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్ దళిత బంధుకు ఎంపికై హోటల్ నడుపుతూ జీవిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో గుడిసె కాలిబూడిదైంది. ఈ ఘటనలో రూ.3 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తక్షణ సాయంగా ఇన్‌చార్జి తహసీల్దార్ ఎల్సాని ప్రవీణ్‌కుమార్ రూ.5వేలు, వంటసామగ్రి, జెడ్పీటీసీ కళావతి రూ.5వేలు అందించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు

వేములవాడరూరల్: అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తామని వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు హెచ్చరించారు. మండలంలోని వట్టింల గ్రామ శివారు నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలించొద్దన్నారు.

నీలోజిపల్లిలో పట్టపగలు చోరీ

- బంగారు నగలు, నగదు అపహరణ


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై అభిలాశ్

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన తిమ్మాపురం సతీశ్ ఇంట్లో శుక్రవారం పట్టపగలు దొంగలు పడ్డారు. ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.30,200 నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు తెలిపిన వివరాలు. సతీశ్ ఇంటి ముందు గేటుకు తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు గేటు తాళం తీయకుండానే లోపలికి ప్రవేశించారు. ఇంటి మెయిన్‌డోర్‌కు వేసిన తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. బెడ్‌రూమ్‌లోని బీరువా తాళం పగులకొట్టి అందులో ఉన్న 11 తులాల బంగారు నగలు, 6 తులాల వెండి రూ.30,200 నగదు చోరీచేశారు. సతీశ్ ఇంటికొచ్చి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. అందులోని బంగారు నగలు, డబ్బు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వేములవాడరూరల్ సీఐ బన్సీలాల్, ఎస్సై అభిలాశ్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ బృందం సభ్యులు పరిశీలించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే


మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

జగిత్యాలక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రాము అన్నారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 65 మందిని కోర్టులో హాజరుపర్చగా గురువారం వారికి న్యాయమూర్తి రూ.68వేలు జరిమానా విధించారు. అనంతరం వీరికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు.




మందుబాబుల అడ్డాగా డబుల్‌బెడ్రూం ఇళ్లు

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్‌లో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. డబుల్‌బెడ్రూం ఇళ్లు పూర్తికావొచ్చినప్పటికీ ఇంకా లబ్ధిదారులకు అందించలేదు. దీంతో నిర్మానుష్యంగా మారడంతో పాటు ఊరికి దూరంగా ఉండడంతో రాత్రిపూట మందుబాబులు తమ వినోదాలకు అడ్డాగా మార్చుకుంటున్నారు. డాబా పైకి చేరి మద్యంతాగి సీసాలు పగులగొడుతూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నారు. అధికారులు స్పందించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

షర్మిలమ్మ పాదయాత్రతో సీఎం కేసీఆర్‌కు గుబులు


వైఎస్ షర్మిలతో పాదయాత్రలో సత్యరాజ్‌వర్మ

మల్యాల: రాష్ట్రంలో షర్మిలమ్మ పాదయాత్రతో సీఎం కేసీఆర్ గుండెల్లో గుబులు మొదలైందని పాదయాత్రలో షర్మిలమ్మకు ప్రజలు నీరాజనం పడుతున్నారని చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్ వర్మ అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ, పర్వతగిరి మండలాల్లో షర్మిలమ్మతో పాదయాత్రలో పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి కూతురిగా షర్మిలమ్మను ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుందన్నారు. పాదయాత్రకు వస్తున్న స్పందనను చూసి, ఓర్వలేక సీఎం కేసీఆర్ షర్మిలమ్మ పాదయాత్రకు అడ్డంకులు కల్పిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీ జెండా ఎగరడం ఖాయమని సత్యరాజ్ వర్మ ధీమా వ్యక్తం చేశారు.

క్రిమిసంహారక మందుతాగి వ్యక్తిమృతి


రాజేశం మృతదేహం

వెల్గటూర్: భార్య, కొడుకు మృతిచెందడంతో పాటు, పక్షవాతంతో బాధపడుతూ ఒంటరిగా జీవిస్తూ జీవితంపై విరక్తి చెంది క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతిచెందిన ఘటన వెల్గటూర్ మండలం జగదేవుపేటలో నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవుపేటకు చెందిన వేముల రాజేశం (50)కు భార్య నీల, కుమారుడు రఘుపతి, కూతురు రజిత ఉన్నారు. పదేళ్ల క్రితం భార్య నీల మూడేళ్ల క్రితం కుమారుడు రఘుపతి అనారోగ్యంతో మృతిచెందారు. కూతురికి వివాహం కావడంతో అత్తగారింట్లో ఉంటోంది. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్న రాజేశం మానసికంగా కుంగిపోయి అనారోగ్యం పాలయ్యాడు. పక్షవాతం బారినపడి ఎడమచేయి పనిచేయడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి క్రిమిసంహారక మందు తాగడంతో గమనించిన స్థానికులు జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవా రు జామున మృతిచెందా డు. మృతుడి కూతురు చిందం రజిత ఇ చ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తులఉమ కోరారు. శుక్రవారం కథలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల బీజేపీ శక్తికేంద్రాల బాధ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా బీజేపీ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. ఏసీడీ పేరిట విద్యుత్ బిల్లులు పెంచి పేదలపై ఆర్థికభారం మోపిన బీఆర్‌ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, గండ్ర విజయ్‌రావు, మల్యాల మారుతి, తోకల వినోద్, వెంకటేశ్వర్‌రావు, నరెడ్ల రవి, బద్రి సత్యం పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రచారం

- హాత్‌సే హాత్ జోడోయాత్ర కరపత్రం ఆవిష్కరణలో అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


కరపత్రం ఆవిష్కరిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రజల్ని చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా హాత్‌సే హాత్ జోడో యాత్ర చేపడుతున్నట్లు జగిత్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈమేరకు ధర్మపురి పట్టణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగిపోతోందని పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా మారుతున్నారన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలే కారణమని రాష్ట్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. ఈ యాత్రలో గడప గడపకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను వివరించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని అడ్లూరి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగనభట్ల దినేశ్, చిలుముల లక్ష్మణ్, వేముల రాజేశ్, సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

మదిలో నదిలా.. పుస్తకం ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన బంక తేజస్విని మదిలో నదిలా... అనే పుస్తకాన్ని రచించడంతో మంచి గుర్తింపుతో పాటు ప్రశంసలు వచ్చాయి. ఈ సందర్భంగా శుక్రవారం బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తేజస్వినిని ఘనంగా సన్మానించారు. బీర్‌పూర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసి ప్రస్తుతం నిజామాబాద్‌లో బీఏ ఫస్టీయర్ చదువుతోంది. తాను రచించిన మదిలో నదిలా పుస్తకాన్ని తన మిత్రులు, సన్నిహితులు పలు కాపీలుగా అచ్చువేయించారు. హైదరాబాద్‌లోని పుస్తక ప్రదర్శనశాలలో ఉంచగా, మేధావులు దీనిని ఉత్తమ రచనగా గుర్తించి తేజస్వినిని అభినందించారు. ఈ సందర్భంగా బీర్‌పూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పుస్తకాన్ని ఆవిష్కరించి, తేజస్వినిని సన్మానించారు. తన చిన్ననాటి జ్ఞాపకాలు, తనకు ఎదురైన అనుభవాలను పుస్తక రూపంలో రచించానని తనకు కవయిత్రిగా ఉత్తమ ప్రశంసలు రావడానికి తన గురువులు, తల్లితండ్రులే కారణమని తేజస్విని పేర్కొంది.

హోరాహోరీగా ఎస్పీఎల్




క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ కలెక్టర్, వికెట్ తీసిన ఆనందంలో..., సీనియర్స్ విభాగంలో ఫైనల్ చేరిన వివేకానంద కళాశాల జట్టు

నేడు జూనియర్, సీనియర్ ఫైనల్ పోరు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఎస్పీఎల్ సీజన్ 4 పోటీలు తుది దశకు చేరుకున్నాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో.. స్పాన్సర్ సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎస్పీఎల్ 4 నేటితో ముగియనుంది. కాగా.. శుక్రవారం మ్యాచ్‌ను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రికెట్‌లో క్రీడాకారులకు కొదువ లేదని.. టాలెంట్ ఉన్న వారు ఎందరో ఉన్నారని.. వారి ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఒక ప్లాట్ ఫాం అని పేర్కొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సాక్షి యూనిట్ బ్రాంచి మేనేజర్ వైద శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్‌లో వివేకానంద

సీనియర్స్ విభాగంలో ఉదయం రెండో సెమీఫైనల్ వివేకానంద డిగ్రీ కళాశాల, కరీంనగర్.. ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ జట్ల మధ్య జరిగింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్సారార్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేసింది. అనంతరం 76 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన వివేకానంద జట్టు కేవలం 6.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. నిఖిల్ 19 బంతుల్లో 2 సిక్స్‌లు, 5 ఫోర్లతో 36 పరుగులు చేయగా.. సాయినాథ్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 27 పరుగులు చేసి జట్టుకు ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేశారు.

నేటి ఫైనల్ మ్యాచ్‌లు

జూనియర్స్ ఫైనల్: ఉదయం 9 గంటలకు జ్యోతిష్మతి డిప్లొమా కళాశాల, తిమ్మాపూర్ వర్సెస్ ఎస్సారార్ జూనియర్ కళాశాల, మంచిర్యాల.
సీనియర్స్ ఫైనల్: మధ్యాహ్నం 12 గంటలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, కరీంనగర్ వర్సెస్ వాగ్దేవి డిగ్రీ కళాశాల, మంచిర్యాల.